సామెతకథలు

# నలభీమ పాకము

- శ్రీ మునునూరి లక్ష్మీగణపతిశాస్త్రి.

దమయంతి నలమహారాజును స్వయంవరంలో వరించిందన్న వార్త దారిలో విని కలి మిక్కిలి అసూయపడెను. ఒకనాడు నలుడు మూత్ర విసర్జనానంతరము పాదశౌచం సరిగా చేయకయే సాయం సంధ్యముగించెను. అదే అదనుగా తలచి కలి పగ తీర్చుకోవడానికి వాన్పై ఆవహించెను. పినతండ్రి కొడుకైన పుష్కరునితో జూదమాడించి, విప్రరూపములో తాను దగ్గఱగా ఉంటూ పూర్తి అపజయం కలుగజేసెను. నలుడు జూదమున రాజ్యమునేగాక, కొంపాగోడూ సయితము ఓడిపోయెను. దమయంతిని వెంటబెట్టుకొని దారీ-డొంకా అనక అరణ్యాలు పట్టెను. కూడుగుడ్డలకు కఱవై, కట్టుబట్టను విసిరి పక్షులను పట్టుకోబోయెను. కాని పక్షులు వస్త్రంతో సహా ఎగిరిపోయాయి. కాలం కర్మం వ్యతిరేకం కావడం చేత కూడు గుడ్డలకు కూడా మొగం వాచాడు. బడలి నిద్రిస్తూండే దమయంతి చీరలో వేఱుగతిలేక సగం చింపుకొని కట్టుకొన్నాడు. అవమానభారంతో ఒక్క క్షణమైనా అక్కడ ఉండలేక నలుడు ఆమెను విడచి వెళ్ళిపోయాడు. దారిలో ఒక దావాగ్నియందు చిక్కుకొన్న కర్కోటకుడనే పాము తన్ను రక్షింపుమని మొఱపెట్టుకొంది. జాలిగలిగి శరణన్న పామును కార్చిచ్చునుండి కాపాడాడు. వెంటనే కర్కోటకుడు నలునిగఱచి, క్షణంలో వికారరూపునిగా జేసివైచాడు. ఇట్లు ఉపకారము చేసినవానికి అపకారము చేయుడము నీకు ధర్మమా? అని నలుడడిగెను.

అంత కర్కోటకుడు "ఓయీ! రాజా! కించపడవద్దు. నీ పరిస్థితి కిప్పుడిదే తగినరూపు. నీవు కోరినప్పుడు నన్ను తలచుకో, వెంటనే నీ నిజరూపము నీకు వస్తుంది. నన్ను అగ్ని నుండి కాపాడావు గనుక నేటినుండి అగ్నిహోత్రుడు నీకు సర్వదా సాయపడుతూ నీ చెప్పుజేతల్లో ఉంటాడు. బాహుకుడనే పేరు పెట్టుకొని ఋతుపర్ణుండనే రాజు వద్ద సమర్థుడవైన వంటలవాడవుగా ఉంటూకాలం గడుపుకో. నేను నీకిప్పుడు అశ్వహృదయ విద్యను ఉపదేశిస్తాను. సమయం వచ్చినప్పుడు ఋతుపర్ణునకు ఉపదేశించి వని నుండి అక్షహృదయ విద్య గడించుకో. దానితో తిరిగి నీ పినతండ్రి కొడుకు పుష్కరునితో జూదమాడి, ఎప్పటియట్ల నీ రాజ్యం పొంది సుఖిస్తావు" అంటూ మాయమయ్యాడు.

నలుడట్లేపోయి ఋతుపర్ణుని దగ్గఱ వంటలవాడుగా కుదిరెను. అతడు కొంచెంగడ్డిని చేతపుచ్చుకొని విసిరీ విసరకుండానే నిప్పు పుట్టేది. వంటపూర్తి అయ్యేవరకు వేటే కట్టెలు అక్కరలేకుండా మంట ఆరిపోకుండా మండుతూనే ఉండేది. నీరు కావలసివచ్చినప్పుడు బిందెలయందు జలం దానంతట అదే నిండుగా ఊరుతూ ఉండేది. రెండు చేతులు చరచినప్పుడు గొప్ప సుగంధద్రవ్యములు పుట్టేవి. వానితో వంట ఘుమఘుమలాడుతూ చవులూరుతూండేది. ఆయా వంటకములు ఎవరెవరికెట్లుంటే

బాగుంటుందని తోస్తుందో అది తిన్నప్పుడు వారివారికి ఆ విధంగానే రుచికరంగా ఉంటూండేది.

పాండవులు అరణ్యావాసము ముగిసిన తరువాత ధర్మరాజు కంకుభట్టను పేరుతో విరటుని కొలువునజేరెను. భీముడును వలలుడను పేర విరటుని దర్శించి, "నేను పూర్వము ధర్మరాజునింట వంటలవాడను" అని చెప్పుకొన్నాడు. విరటుడు వల్లెయనుచు వంటలవార్పై పెత్తనదారుగా నుండ నియమించెను. వలలుడు వంటశాలలో ప్రవేశించినది మొదలు అన్నియు విచిత్రములైన పనులే చేయుచుండెను. పెద్ద పెద్ద గాడి పొయ్యలపై వంట చేయించుచూ, అట్లు కాదు ఇట్లని బరువైన గుండెగలను ఒంటి చేతితో తీసుకొని వచ్చువాడు. పుట్లకొలది లావుపాటి దుంగలను సైతము చేతులతో విఱచి గాడి పొయ్యలో పెట్టుచుండెడివాడు. చిన్న నిప్పు నలుసునువైచి ఊదినప్పుడు తుఫాను గాలి వలె యుండెడిది. వెంటనే పొయ్యి జాజ్వల్యమానముగా మండెడిది. కొలత లేకుండా బస్తాలకొలది బియ్యమును ఎసటిలో పోయుచుండెడువాడు. క్షణములో కూరలు తఱిగి, ఉడికించి ఉప్పు కారములను చేటలతో వేయుచుండెడివాడు.

అతడే పదార్థము చేసినను పాకము అమృతప్రాయమై యుండెడిది. వలలుడు తన వంటకములను ముందుగా విరటునకు కంకుభట్టునకుబెట్టించి పిమ్మట తన సోదరులకును ద్రౌపదికిని బెట్టించువాడు. ఇతని చర్యలను అంతఃపురకాంతలు మేడలపైగవాక్షములనుండి వింతగా చూడజొచ్చిరి. ఈ క్రొత్త వంటలవాడు చేసిన వంటకములు చేయుతీరు, పదార్థములరుచి చూచి ఈతడెంతటి పాకశాస్త్ర నిపుణుడో! కదా! యని సర్వులును వేనోళ్ళ మెచ్చుకొనుచుండిరి. నలుని తరువాత ఇంతటి పాకశాస్త్ర నిపుణుడు మఱియొక్కడు లేడు. ఉండబోడని పదుగురిలో పేరు ప్రఖ్యాతులు వచ్చెను.

ఆనాటినుండి నలుణ్ణి భీముణ్ణి మహాపాక శాస్త్రవేత్తలుగా గుర్తించిరి.

(అసలు కథకు కొన్ని మార్పులు చేసి ప్రచురించడం జరిగింది.)

**"కోమటి సాక్ష్యం" సామెత కథ వచ్చే సంచికలో ...**

*** *** ***

**పాత సామెత:**

రౌతు కొద్దీ గుఱ్ఱము - పిండికొద్దీ రొట్టె.

**క్రొత్త సామెత:**

యజమానిని బట్టి సేవకుడు - జీతాన్ని బట్టి పని.